## క్లుప్తంగా

### కోటయ్య సన్నిధికి...



ప్రభ ట్రాక్టర్‌ను నడుపుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: మండలంలోని కేసానుపల్లి నుంచి వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రభ శనివారం కోటప్పకొండకు బయలుదేరింది. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ప్రభ వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభను ట్రాక్టర్‌పై ఉంచి ఊరేగింపుగా కొండకు తరలించారు. గత 15 సంవత్సరాలుగా గ్రామస్తులు ప్రభను ఏర్పాటుచేసి కొండకు తరలిస్తున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు మారూరి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అన్నదాన సత్రానికి విరాళం

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామస్తులు కోటప్పకొండ తిరునాళ్ళ సందర్భంగా కాకతీయ అన్నదాన సత్రానికి దాతలు విరాళంగా రూ. ఒక లక్ష 72 వేల 516 రూపాయలు అందజేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రతి ఏటా అన్నదాన సత్రానికి విరాళం నగదు రూపంలో అందజేస్తున్నట్లు కమిటీ సభ్యులు చెప్పారు.

### షటిల్ పోటీల్లో సాతులూరు విద్యార్థి సత్తా



డబుల్స్ షటిల్‌లో విన్నర్లుగా నిలిచిన పృథ్వీ సాయి మణికంఠ, పార్టనర్ అభిరామ్‌లు

నాదెండ్ల: సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి దాలరాజు పృథ్వీ సాయి మణికంఠ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన షటిల్ పోటీల్లో ప్రతిభ చాటాడు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ నెల 17న జరిగిన పోటీల్లో డబుల్స్ విభాగంలో విన్నర్‌గా, సింగిల్స్ విభాగంలో మూడో స్థానంలో నిలిచాడు. డబుల్స్ విభాగంలో విజయనగరానికి చెందిన అభిరామ్‌తో జట్టుగా ఆడి మొదటి స్థానం సాధించాడు. పృథ్వీసాయి మణికంఠ సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2020లో పదో తరగతి పూర్తి చేశాడు. 2019–20లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఎంట్రెన్స్‌లో ఎంపికై ప్రస్తుతం ఇంటర్ చదువుతున్నాడు. ఈయన తండ్రి సాంబశివరావు సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నరసరావుపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నూజెండ్ల మండలం గుర్రపునాయుడుపాలెం గ్రామానికి చెందిన బత్తిన నిర్మల్ కుమార్ (27) శుక్రవారం రాత్రి ద్విచక్రవాహనంపై ప్రకాశం జిల్లా మార్టూర్‌లో ఉన్న సోదరి దగ్గరకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని ఈశ్వర్‌మహల్ థియేటర్ వద్దకు వచ్చేసరికి ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా కొట్టింది. సంఘటనలో నిర్మల్‌కుమార్ తలకు తీవ్రగాయాలు అయ్యాయి. 108 ద్వారా క్షతగాత్రుడిని ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరేంద్ర బాబు తెలిపారు.

### న్యూరో సైన్సు రీసెర్చ్‌లో జాతీయస్థాయి గుర్తింపు



జాతీయ స్థాయిలో ప్రశంస పత్రాన్ని అందుకుంటున్న కాశీవిశ్వనాథ్

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామవాసీ ప్రముఖ స్టాంప్ రైటరు మతుకుమల్లి రామకృష్ణ హనుమంతరావు–పద్మ దంపతుల కుమారుడు కాశీవిశ్వనాథ్ (విద్యార్థి) కేరళలో శ్రీఅమృత విశ్వవిద్యాపీఠం నుంచి న్యూరోసైన్సు విభాగంలో రీసెర్చ్ చేసిన నేపథ్యంలో అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు వచ్చినట్లు కాశీవిశ్వనాథ్ శనివారం తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈనెల 16న సిక్కిం రాష్ట్రం మనిపాల్ యూనివర్సిటీనందు జరిగిన హెచ్‌వోడీలు శ్యామ్‌దివాకర్, హేమలతల పర్యవేక్షణలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ పోటీల్లో రీసెర్చ్ చేసిన అంశాలను వివరించినట్లు చెప్పారు. రీసెర్చ్ చేసిన అంశాలను జాతీయ స్థాయిలో ప్రచురణ కావటం చాలా ఆనందంగా ఉందన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభ కనపరిచిన కాశీవిశ్వనాథ్‌ను తన గ్రూపు సభ్యులను స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యేలు మక్కెన, జీవీ అభినందనలు తెలిపినట్లు రామకృష్ణ వెల్లడించారు.

### ● చిట్టి 'ప్రభంజనం'!!



మహాశివరాత్రి అంటే పిల్లా–పెద్దా అందరికీ ఓ పెద్ద పండుగ. అందునా కోటప్పకొండ పరగణాలోని వాసులకయితే ఇంటిపండుగ! ఇక ఈ పండుగ వేళ పిల్లల ఆనందాన్ని స్వయంగా పరిశీలిస్తే తప్ప చెప్పడం, రాయడం అసాధ్యం. కోటయ్య స్వామి తిరునాళ్లు అంటే కొండకు వెళ్లడమే ఒక్కటే కాదు.. ఆయనకు ఎంతో ఇష్టమైన ప్రభను కట్టి దాన్ని భక్తిపూర్వకంగా కొండ వరకూ తీసుకెళ్లి ఆయనకు దాన్ని దర్శింపచేసి తిరిగి ఇళ్లకు చేరడం ఆనవాయితి. పెద్దలు పెద్ద ప్రభలు కట్టి తీసుకువెళతారు. మరి చిన్నారులు? ఇదిగో వారికి తోచిన రీతిన చిట్టి ప్రభలు కట్టి భక్తిప్రపత్తులతో వాటిని ఇలా ఊరేగిస్తారు. శనివారం నరసరావుపేట పట్టణంలో ఈ చిట్టిచేతుల్లో రూపుదాల్చిన చిట్టి ప్రభలు సాక్షి కెమెరాలో క్లిక్ మన్నాయి.

–సాక్షి, నరసరావుపేట

# చేదుకో కోటయ్యా....

- కోటప్పకొండంతా భక్తజన సంద్రం!
- శివనామస్మరణతో మార్మోగిన కోటయ్య సన్నిధి
- భక్తుల దాహార్తి, ఆకలిని తీర్చిన సత్రాలు, స్వచ్ఛంద సంస్థలు
- విద్యుత్ ప్రభలు, మొక్కుబడి ప్రభలు రాక



పాతూరు భీమలింగేశ్వర స్వామి



నరసరావుపేట శృంగేరి మఠం శంకర చంద్రమౌళేశ్వర స్వామి

నరసరావుపేట రూరల్ / నరసరావుపేట: దేశంలోనే ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారి దేవస్థానం శివనామస్మరణతో మారుమ్రోగింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని లక్షలాది మంది భక్తులు శనివారం కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున స్వామి దర్శనం కోసం తరలిరావడంతో కోటప్పకొండ పుణ్యక్షేత్రం భక్తజన సందోహంతో నిండిపోయింది.

- తెల్లవారుజామున 3 గంటలకు బిందెతీర్థంతో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు.
- ఆలయ ఉప ప్రధాన అర్చకులు అప్పయ్య గురుకుల్ ఆధ్వర్యంలో అభిషేక కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు.
- స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం భక్తులను స్వామి వారి దర్శనానికి అనుమతించారు.
- స్వామి వారి దర్శనం కోసం అర్ధరాత్రి నుంచి భక్తులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు.
- ఉచిత దర్శనంతో పాటు రూ.100లు, రూ.200లు, అభిషేక క్యూల ద్వారా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.
- భక్తులతో క్యూకాంప్లెక్స్ కిక్కిరిసింది.
- ఉచిత దర్శనంలో భక్తుల తాకిడి అధికంగా కనిపించింది. అభిషేక మండపంలో నిర్వహించిన అభిషేకాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.
- తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన భక్తుల రద్దీ నిరంతరాయంగా కొనసాగింది.
- సోపాన మార్గం నుంచి భక్తులు మెట్ల పూజ నిర్వహించుకుంటూ కొండపైకి చేరుకున్నారు.
- ధ్యానశివుడు, నాగేంద్రుని పుట్ట, నంది విగ్రహం వద్ద భక్తులు పూజలు నిర్వహించారు.
- త్రిముఖ శివలింగం వద్ద యాత్రికులు సెల్ఫీలు తీసుకోవడం కనిపించింది. పలువురు భక్తులు కాలినడకన పాతకోటయ్య స్వామి ఆలయం వద్దకు చేరుకుని దర్శించుకున్నారు.
- కొండ క్రింద నుంచి సప్తగిరి బస్సుల్లో ఆర్టీసీ యాత్రికులను చేరవేసింది.
- 60 సప్తగిరి బస్సులను ఇందుకోసం వినియోగించారు.
- ఘాట్‌రోడ్డులో ఎలాంటి ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.
- తిరునాళ్లకు నరసరావుపేట, చిలకలూరిపేట మండలాల పరిధిలోని పలు గ్రామాల నుంచి భక్తులు సుమారు 20కుపైగా విద్యుత్ ప్రభలతో పాటు వందలాదిగా సాధారణ తడిక మొక్కుబడి ప్రభలు త్రికోటేశ్వరస్వామి సన్నిధికి తీసుకొచ్చారు.
- ఎండ తీవ్రంగా ఉన్నా లెక్కచేయకుండా మహిళలు, పిల్లలతో సహా తరలిరావటం కన్పించింది.
- కొండకు సమీపంలోని చిలకలూరిపేట మేజర్ కాలువలో స్నానాలు చేసి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు.
- కొండ దిగువ భాగాన మెట్లమార్గంలోని శ్రీ విఘ్నేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని మెట్ల మార్గం ద్వారా వేలాదిమంది భక్తులు కొబ్బరికాయలు కొట్టి మెట్లపూజ చేస్తూ కొండపైకి చేరుకున్నారు.
- భక్తులకు దాహార్తిని తీర్చేందుకు పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, చారిటబుల్ ట్రస్టుల ప్రతినిధులు మజ్జిగ, పులిహోర, వాటర్ బాటిళ్లను ఉచితంగా అందజేశారు.
- అలాగే భక్తుల ఆనందం కోసం ఏర్పాటుచేసిన రంగుల రాట్నం, తోరా..తోరా లాంటి వాటిని ఎక్కి పెద్దలు, పిల్లలు పండగను జాలీగా గడిపారు.
- నరసరావుపేట, చిలకలూరిపేట, కొండకు వెళ్ళే జంక్షన్‌లో ఏర్పాటుచేసిన శివుని విగ్రహం ముందు నిలబడి సెల్ఫీలు తీసుకునేందుకు భక్తులు పోటీపడ్డారు.
- అలాగే మధ్యాహ్న సమయంలో రెడ్డి, కమ్మ, కాపు, బ్రాహ్మణ, వైశ్య, యాదవ, వడ్డెర, బొందిలిసింగ్ కులాలతో పాటు సుమారు 20 కులాలకు చెందిన సత్రాల్లో వేలాదిమందికి ఉచితంగా అన్నదానం ఏర్పాటు చేశారు.
- వ్యవసాయం, ఉద్యానశాఖ, డ్వాక్రా, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ, హ్యాండ్ ఆఫ్ కంపాషన్ పాటు వివిధ ప్రభుత్వ సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లను భక్తులు సందర్శించి వాటి వలన కలిగే ప్రయోజనాలను తెలుసుకున్నారు.
- జంక్షన్‌లో కమాండ్ కంట్రోల్‌రూం ఏర్పాటు చేసిన పోలీసులు ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీగా బందోబస్తు నిర్వహించారు.
- మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కోటప్పకొండ క్రింద సమాచార పౌర సంబంధాల శాఖ సందర్శనీయ స్థలాలు స్థలాలు, అభివృద్ధి సంక్షేమ పథకాలపై ఏర్పాటుచేసిన ఛాయాచిత్ర ప్రదర్శనను జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి జాయింట్ కలెక్టర్ సంయుక్తంగా ప్రారంభించి తిలకించారు.
- డీఆర్‌డీఏ, మెప్మా, వ్యవసాయ అనుబంధ శాఖలు, వివిధ శాఖలు చేసిన స్టాల్ లను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు ప్రారంభించారు.

#### స్వామి సేవలో ప్రముఖులు

త్రికోటేశ్వర స్వామి వారిని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, భారీ నీటిపారుదల శాఖమంత్రి అంబటి రాంబాబు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్సీలు జంగా కృష్ణమూర్తి, మురుగుడు హనుమంతరావు, డొక్కా మాణిక్యవరప్రసాద్‌లు దర్శించుకున్నారు. మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, మాజీ ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్, యర్రం వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర చేనేత కార్పొరేషన్ చైర్మన్ గంజి చిరంజీవి, పొడా చైర్మన్ మిట్టపల్లి రమేష్‌లు స్వామి వారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. అలాగే హైకోర్టు న్యాయమూర్తి సుజాత త్రికోటేశ్వరున్ని దర్శించుకున్నారు.

#### కాలినడకన వచ్చిన ఎంపీ లావు దంపతులు

నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు దంపతులు త్రికోటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. కొండ కింద నుంచి మెట్లమార్గంలో కొండపైకి చేరుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం యాగశాలలో నిర్వహించిన రుద్రహోమంలో పాల్గొన్నారు.

#### ఏర్పాట్లు పర్యవేక్షించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు

స్వామి వారి దర్శనం కోసం వచ్చిన భక్తులకు అందుతున్న సౌకర్యాలను జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లు పర్యవేక్షించారు. కొండపైన పర్యటిస్తూ భక్తులతో మాట్లాడారు. ఆలయంలో ఏర్పాట్లపై వారిని ప్రశ్నించారు. క్యూలైన్‌లో తాగునీరు, మజ్జిగ అందించారా అంటూ ప్రశ్నించారు. ఆలయంలో ఏర్పాట్లు బాగున్నాయని, గంటలోనే దర్శనం కూడా పూర్తవుతుందని భక్తులు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఆలయ ప్రాంగణలోనే ఉండి ఎప్పటికప్పుడు అధికారులకు సూచనలు ఇస్తూ ఏర్పాట్లు పర్యవేక్షించారు. జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి కొండపై పర్యటించారు. విధుల్లో ఉన్న పోలీసులకు సూచనలు ఇచ్చారు.

#### భక్తులకు విస్తృత సౌకర్యాలు..

స్వామి వారి దర్శనానికి వచ్చే యాత్రికులకు ఆలయ అధికారులు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. క్యూలైన్‌లోని భక్తులకు తాగునీరు, పాలు, మజ్జిగ, అరటిపండు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఆరు క్యూలైన్ల ద్వారా భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. దీంతో ఉచిత దర్శనానికి రెండు గంటలు, ఇతర దర్శనాలకు గంట పాటు సమయం పట్టింది. ఆలయంలో నిత్యాన్నదాన మండప నిర్మాణానికి సహకరించిన చిలకలూరిపేటకు చెందిన దాత తాళ్ల సుధీర్ సహకారంతో భక్తులు అల్పాహారం అందజేశారు.

#### కిటకిటలాడిన శివాలయాలు

నరసరావుపేట ఈస్ట్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శైవాలయాలు భక్తజనులతో కిటకిటలాడాయి. ఉదయం ఆయా ఆలయాలలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించారు. చిన్నారులు తమ మొక్కుబడి ప్రభలతో తమ తల్లిదండ్రులతో కలసి పాతూరులో వేంచేసియున్న భీమలింగేశ్వరస్వామి వారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. మరికొందరు తమ ప్రభలతో కాలినడకన త్రికోటేశ్వరస్వామి దర్శనార్థం కోటప్పకొండ తరలివెళ్లారు. పట్టణం నడిబొడ్డున ఉన్న గరళకంఠుడి విగ్రహం వద్ద భక్తులు పూజలు జరిపారు. శృంగేరీ శంకరమఠంలోని శంకర చంద్రమౌళేశ్వర స్వామి, బరంపేటలోని వాయుమల్లేశ్వర స్వామి,రావిపాడురోడ్డు బాలయ్యనగర్‌లోని కల్యాణ సుందరేశ్వరస్వామి, ఎన్‌ఎస్‌పీ కాలనీ శివాలయాలలో భక్తులు అధికసంఖ్యలో పూజలు జరిపారు.



గణపవరం శివాలయంలో ప్రత్యేక అలంకరణలో మూలవిరాట్

#### తులసీ సీడ్స్‌చే అన్నదానం

నరసరావుపేట: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కోటప్పకొండకు విచ్చేస్తున్న భక్తుల భద్రతా పర్యవేక్షణ నిమిత్తం విధుల్లో పాల్గొంటున్న 500మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ సిబ్బంది, మూడు వేలమంది భద్రతా సిబ్బందికి తులసీ సీడ్స్ చైర్మన్ తులసీ రామచంద్ర ప్రభు అల్పాహార, భోజన సదుపాయాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని తులసీ సీడ్స్ డైరక్టర్ తులసీ కృష్ణ చైతన్య లాంఛన ప్రాయంగా ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటప్పయ్య, శిబిర నిర్వాహకులు పి.శ్రీనివాసరావు, క్యాంపు ఆఫీసర్ వి.రాంబాబు, క్యాంపు సహాయకులు వి.వి.హరనాధ్,ఎం.కృష్ణయ్య, దావూద్, అంజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

#### శావల్యాపురంలో...

శావల్యాపురం: మహాశివరాత్రి పర్వదిన వేడుకలు మండలంలోని వేల్పూరు, గంటావారిపాలెం, మతుకుమల్లి, కారుమంచి, తదితర గ్రామాల్లో శివాలయాల్లో భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో శనివారం నిర్వహించారు. శావల్యాపురంలో వేంచేసియున్న శ్రీప్రసన్న రామలింగేశ్వరస్వామి దేవాలయంలో తెల్లవారుజాము నుంచి భక్తుల రద్దీతో శివనామస్మరంతో మారుమ్రోగింది. ఆలయ పూజారీ సాయిభరత్ సారథ్యంలో శివలింగానికి విశేష పూజలు భక్తులు ఘనంగా నిర్వహించారు. పూజలు అనంతరం శివలింగాన్ని నూతన వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. మండలంలోని కొత్తలూరు, పోట్లూరు గ్రామాల్లోని ఏర్పాటు చేసిన మొక్కుబడి ప్రభలను మేళాతాళాల నడుమ ట్రాక్టర్లు వైభవంగా ఊరేగింపుగా కోటప్పకొండకు తరలించారు.

#### బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో...

నరసరావుపేట రూరల్: బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో కోటప్పకొండలో భక్తులకు ద్వాదశ జ్యోతిర్లింగ దివ్యదర్శనాన్ని ఏర్పాటుచేశారు. త్రిముఖ శివలింగం దిగువ భాగాన ఈనెల 16వ తేదీ ఏకాదశి నుంచి 18వ తేదీ శనివారం వరకు దర్శనాన్ని కల్పించారు. దేశంలోని 12 జ్యోతిర్లింగ క్షేత్రాల దర్శనంతో పాటు శివలింగానికి స్వహస్తాలతో క్షీరాభిషేకం చేసే అవకాశాన్ని భక్తులకు కల్పించారు.

#### నాదెండ్లలో....

నాదెండ్ల: అన్నిదారులూ శివాలయం వైపే.... అనేలా మహాశివరాత్రి సందర్భంగా భక్తులు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనిత్రయోదశి, మాసశివరాత్రి, మహాశివరాత్రి మూడు శనివారం కావటంతో విశేషమైన మహాశివరాత్రిగా భక్తులు పూజల్లో పాల్గొన్నారు. గ్రామాల్లోని శివాలయాల్లో పూజలు, అభిషేకాలు జరిగాయి. అనంతరం అన్ని గ్రామాల నుంచి భక్తులు కోటప్పకొండకు తరలివెళ్ళి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామాల్లో చెరుకుగడలు, బొమ్మల స్టాల్స్ ఏర్పాటు చేశారు. సాతులూరులో ఆదివారం తోపు తిరునాళ్ళనిర్వహించనున్నారు. మహ శివరాత్రి మరుసటి రోజు అనాదిగా తోపుతిరునాళ్ళ జరుపుతారు. కోటప్పకొండకు వెళ్ళితిరిగి వచ్చే ప్రభలు ఈ గ్రామంలో నిలిచి తోపు తిరునాళ్ళ నిర్వహించటం ఆనవాయితీ.

#### యడ్లపాడులో...

యడ్లపాడు: మండలంలోని శైవాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. శనివారం వేకువ జాము నుంచే శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని యడ్లపాడు, లింగారావుపాలెం, జగ్గాపురం, జాలాది, ఉన్నవ, చెంఘీజ్‌ఖాన్‌పేట, కొండవీడు, కొత్తపాలెం, మైదవోలు, తిమ్మాపురం, తుర్లపాడు, దింతెనపాడు, కారుచోల, సందెపూడి గ్రామాల్లోని ఆలయాల్లో మహాశివుడికి ప్రత్యేక పూజలు, వివిధ రకాల అభిషేకాలను అర్చకులు నిర్వహించారు. కొన్ని ఆలయాల్లో తెల్లవారు జామున, మరికొన్నింటిలో అర్ధరాత్రి సమయంలో లింగోద్భవకు మహారుద్రాభిషేకం కార్యక్రమాన్ని పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమానికి మహిళలు అత్యధిక సంఖ్యలో హాజరై అభిషేక పూజల్లో భాగస్వాములయ్యారు. రేయంతా జాగారం చేసి శివనైవేద్యాలను స్వీకరించారు. ఉన్నవ గ్రామస్తులు 150 మంది గ్రామంలోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి పర్వదినం సందర్భంగా 150 ప్రదక్షిణలు చేశారు.

#### చిరుమామిళ్లలో...

నాదెండ్ల: చిరుమామిళ్ల గ్రామంలో కొలువైయున్న శ్రీ కోటేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసింది. ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండ తిరునాళ్లలా చిరుమామిళ్లలో వేడుకలు జరిగాయి. లింగోద్భావ సమయంలో అభిషేకాలు, అర్చనలు జరిగాయి. గ్రామస్తులు గ్రామ ప్రభలు ఏర్పాటు చేశారు.

### వైభవంగా గిరిప్రదక్షిణ



గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మక్కెన మల్లికార్జునరావు

వినుకొండ(నూజెండ్ల): మహాశివరాత్రి సందర్భంగా వినుకొండ కొండపై వేంచేసి ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి అనుగ్రహం కోరుకుంటూ విశ్వహిందూ పరిషత్ వినుకొండ ఆధ్వర్యంలో శనివారం గిరిప్రదక్షిణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నేత మక్కెన మల్లికార్జునరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ముందుగా కొండమెట్ల వద్ద ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం వద్ద శివలింగానికి పూజలు నిర్వహించి కొండ చుట్టూ ద్విచక్రవాహనాలతో గిరిప్రదక్షిణ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ పల్నాడు జిల్లా అధ్యక్షులు భాగవతుల రవికుమార్, వీహెచ్‌పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### వైభవంగా కల్యాణ మహోత్సవం



ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిని సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

బొల్లాపల్లి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని మన్నేపల్లి తండా అటవీ ప్రాంతంలో స్వయంభువుగా వెలసిన మన్నేపల్లయ్య స్వామి తిరునాళ్ల మహోత్సవం శనివారం వేడుకగా నిర్వహించారు. శివరాత్రి పర్వదినాన ఈ ఆలయంలో మన్నేపల్లి లక్ష్మీనరసింహ స్వామి, వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం వైభవోపేతంగా కను ల విందుగా కమణీయంగా నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన భక్తులు తెల్లవారు జాము నుంచే స్వామివారిని దర్శించుకొని పొంగళ్లతో నైవేద్యం సమర్పించి పూజలు చేశారు. తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, వైఎస్సార్ సీపీ నేతలు, నాయకులు, కార్యకర్తలు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వ హణ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలను ఘనంగా సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. రెండు జిల్లాల పరిధిలోని భక్తుల సౌకర్యార్థం రాకపోకలకు వినుకొండ, మాచర్ల, మార్కాపురం, పిడుగురాళ్ల ఆర్టీసీ డిపోల నుంచి బస్సు సౌకర్యం కల్పించారు. చుట్టు పక్కల గ్రామాలు రావులాపురం, మన్నేపల్లి తండా, మర్రివేముల, గంగుపల్లి తదితర గ్రామాల వారు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలను, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పులిహోర, మంచినీటి సౌకర్యం భక్తులకు అందజేశారు. వీరితో పాటు పలు స్వచ్ఛంద సంస్థలు పులిహోర, మంచినీరు భక్తులకు అందజేశారు. బండ్లమోటు ఎస్ఐ జె.బలరాంరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు నిర్వహించారు.



కోటప్పకొండ దిగువన సత్రాలలో భోజనం చేస్తున్న భక్తులు



కోటప్ప కొండ వద్ద ఏర్పాటు చేసిన రంగుల రాట్నం ఎక్కి ఆనందిస్తున్న చిన్నారులు



కోటప్పకొండ దిగువన మెట్లమార్గం ప్రవేశం వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు చేస్తున్న భక్తులు



నరసరావుపేట పాతూరు శివాలయంలో భక్తుల సందడి




స్కౌట్స్ అండ్ గైడ్స్, పోలీసులకు అన్నం వడ్డిస్తున్న తులసీ కృష్ణ




శావల్యాపురంలో రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు



సభక్తికంగా నమస్కారం చేస్తున్న యువతి



కోటప్పకొండ (దిగువ నుంచి)



శివలింగం వద్ద భక్తుల తాకిడి